ప్రజాశక్తి
మంగళవారం 17 జనవరి 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఈసురోమంటున్న ఇళ్ల నిర్మాణం

ఇటీవల సిపిఎం చేపట్టిన సర్వేలో ప్రత్తిపాడులో సమస్యలు చెబుతున్న లబ్ధిదారుడు

- ప్రభుత్వ సొమ్ము సరిపోక ఇబ్బందులు
- రూ.5 లక్షలకు పెంచాలంటున్న లబ్ధిదారులు
- ఉగాదికి 8,705 ఇళ్ల పూర్తికి అధికారుల కసరత్తు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జగనన్న కాలనీల్లో పక్కా గృహ నిర్మాణం మందకొడిగా సాగుతోంది. ఇప్పటి వరకు పలు కారణాలతో ఇళ్ల నిర్మాణం వేగం పుంజుకోలేదు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 69,912 ఇళ్లను తొలిదశలో మంజూరు చేయగా ఇప్పటి వరకు మ్యాపింగ్ చేసిన వాటిల్లో 63,361 ఇళ్లను చేపట్టారు. వీటిల్లో కేవలం 8,705 ఇళ్లు మాత్రమే పురోగతిలో ఉన్నాయి. వీటిని ఉగాది నాటికి పూర్తి చేయించాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు సూచించింది. ఒక్కో ఇంటికి రూ.లక్షా 80 వేలు, మరో 35 వేలు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇప్పించి మొత్తం రూ.2.15 లక్షలతో ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది.

మొదటి, రెండు కేటగిరిల్లో లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకునేలా చేపట్టినవి 41 వేల వరకు ఉన్నాయి. ప్రభుత్వమే నిర్మించి ఇచ్చేలా మరో 22 వేలు ఇళ్లు ఉన్నాయి. గుంటూరు నగర వాసులకు దాదాపు 62 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వగా 20 వేల ఇళ్లు తొలిదశలో నిర్మించాలని నిర్ణయించారు. పేరేచర్ల, ఏటుకూరు, లాం, కొర్నేపాడు, బుడంపాడు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో నిర్మాణాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. కొర్నేపాడులో ఒక కాలనీలో ఇంత వరకు ఒక్క ఇల్లు కూడా చేపట్టలేదు. ఇక్కడ మౌలిక సదుపాయాలు లేవు. రెండో కాలనీలో వందల సంఖ్యలో చేపట్టారు. గుంటూరు నగర

2లో

ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలి

జిల్లాలో గృహనిర్మాణం వేగం పుంజుకోవాలంటే ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షలివ్వాలి. ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు, రూ.35 వేల రుణంతో నిర్మాణాలు పూర్తి కావు. బిల్డింగ్ మెటీరియల్ వ్యయం, కూలీల ఖర్చు గణనీయంగా పెరిగినందున నిర్మాణాలకు కేటాయించిన సొమ్మును తక్షణమే పెంచాలి. కనీసం బ్యాంకు ద్వారా రుణమైనా ఇప్పించాలి. ఇందుకు ప్రభుత్వ యంత్రాంగం చొరవ తీసుకోవాలని కోరారు.

పాశం రామారావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి.

డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి

ఎమ్మెల్సీలకు దళిత, ప్రజా సంఘాల నాయకులు వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్సి, ఎస్టీ, సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఇందుకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం నిర్వహించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), ఇతర దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు వినతిపత్రాలు ఇచ్చారు. 2013లో ఎస్సి, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం చేశారని, చట్టం కాలపరిమితి 2023 మార్చితో ముగుస్తుందని, కావున ప్రభుత్వం వెంటనే చట్టం కాలపరిమితి పెంచటానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయింపునకు కృషి చేయాలని, బడ్జెట్‌లో దళిత, గిరిజనులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా నేటికీ దళితులపై దాడులు, కులవివక్ష, అంటరానితనం కొనసాగుతూనే వున్నాయని, ఎస్సి కాలనీలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు. దళిత వాడల్లో శ్మశాన స్థలాలు చాలక ఇబ్బందులు పడుతున్నారని, ఆ స్థలాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు చెందిన 27 రకాల సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించకుండా వాటిని నిరుపయోగంగా మార్చిందని, సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా దళితుల అభ్యున్నతికే వినియోగించాలని, ఎస్సి, ఎస్టీ

2లో

పండగ పూట విషాదం

- రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం
- అత్తగారింటికి వెళ్తూ ఒకరు, తల్లిదండ్రుల వద్దకెళ్తూ మరొకరు మృతి
- ఈతకెళ్లి యువకుడు మృత్యువాత

మూడ్రోజులపాటు వరుసగా వచ్చే పండుగల సంబరాల్లో అందరూ సంతోషంగా ఉండగా మరికొన్ని కుటుంబాల్లో ప్రమాదాలు తీరని వేదనను మిగిల్చాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆదివారం వాటిల్లిన ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడగా ఈతకెళ్లిన మరో యువకుడు మృతి చెందాడు. ఆయా ఘటనలపై వివరాలు..

2లో

దూసుకెళ్తున్న మైనర్లు

- హెచ్చరికలు భేఖాతరు - అడ్డగోలుగా బైక్ రైడింగ్
- పోలీసుల అదుపులో 106 మంది - తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరులో మైనర్ యువకులు ద్విచక్ర వాహనాలపై దూసుకుపోతున్నారు. 14-18 ఏళ్ల లోపు యువకులు ఎక్కువగా వాహనాలను నడుపుతున్నారు. ప్రధాన రహదారులపైనే అడ్డూ అదుపులేకుండా అతి వేగంగా డ్రైవ్ చేస్తూ చూపరులను, ఇతర వాహనాలను భయపెడుతున్నారు. వీరు ప్రమాదాల బారిన పడటమే కాకుండా ఎదురుగా వచ్చే వాహనాలను సైతం ఢీకొట్టే రీతిలో వెళ్తున్నారు. మైనర్లకు వాహనాలను అప్పగిస్తే సంబంధిత తల్లిదండ్రులపైనే కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పి ఆరీఫ్ హఫీజ్ ఇటీవల హెచ్చరించారు. ఈ హెచ్చరికలను ఖాతరు చేయకుండా వాహనాలను వారి కుమార్లుకు ఇస్తున్నారు. వాహనాలకు ఉన్న వేగం మొత్తం ఒకేసారి ఉపయోగించి వారు ప్రమాదాల బారినపడటమే కాకుండా ఎదురుగా వస్తున్నవారిని సైతం ప్రమాదాలకు గురి చేస్తున్నారని తెలిసినా వాహన యజమానులు పట్టించుకోవడం లేదు. కనీసం శిక్షణ, ట్రాఫిక్‌పై అవగాహన లేకుండానే అతివేగంతో నడిచే వాహనాలను సైతం చిన్న పిల్లలకు ఇస్తున్నారు. ప్రధానంగా లక్ష్మీపురం, విద్యానగర్, కొత్తపేట, అమరావతి రోడ్డు, లాలాపేట, శ్రీనివాసరావుతోట, బ్రాడీపేట, అరండల్‌పేట, శ్రీనివాసరావుతోట, ఆనంద్‌పేట, పాత గుంటూరు, బాలాజీపేట, చుట్టుగుంట, ఏటి అగ్రహారం తదితర ప్రాంతాల్లో మైనర్లు వాహనాలను అతి వేగంగా నడుపుతున్న ఘటనలు కన్పిస్తున్నాయి. లక్ష్మీపురం, విద్యానగర్ ప్రధాన మార్గాల్లో బైక్‌పై విన్యాసాలు చేయడం, సైలెన్సర్ తీసేసి పెద్ద శబ్దంతో వాహనాలను నడటపం, ఇద్దరు, ముగ్గురు కలిసి ఒకే వాహనంపై అతివేగంగా వెళ్లడం పరిపాటైంది. హెల్మెట్, లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేయడం నేరమని తెలిసినా తల్లిదండ్రులు, వారి బంధువులు మైనర్లకు వాహనాలను ఇచ్చేస్తున్నారు. ఈ అంశంపై ప్రజల

2లో

వాహనాలు నడుపుతున్న మైనర్లతో మాట్లాడుతున్న పోలీసులు

సందడిగా సంక్రాంతి సంబరాలు

వార్తలు లోపలి పేజీల్లో

ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. ప్రైవేటు రంగంలోను రిజర్వేషన్లను పాటించాలన్నారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ మండలిలో పిడిఎఫ్ తరుపున ఈ అంశాన్ని చర్చకు పెట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు కె.వినయ్‌కుమార్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బి.వీరాస్వామి, బిసి సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ టి.నరసిహరావు, బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘాల జిల్లా కార్యదర్శులు ఇ.అప్పారావు, బి.శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కష్ణకాంత్, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి జె.నవీన్ పాల్గొన్నారు.

దూసుకెళ్తున్న మైనర్లు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి వస్తున్న విమర్శల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

పోలీసుల అదుపులో 106 మంది

మైనర్ డ్రైవింగ్, నంబర్ ప్లేట్ వాహనాలపె ప్రత్యేక నిఘా విధించామని పశ్చిమ విభాగం ట్రాఫిక్ సిఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. పలువురు మైనర్లను అదుపులోకి తీసుకుని వారితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. గుంటూరులోని విద్యానగర్, లక్ష్మీపురం, అమరావతి రోడ్డు, శంకరవిలాస్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేయగా 14 మంది బాలలు పట్టుబడ్డారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు చొప్పున ప్రయాణిస్తుండగా 54 వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. నంబరు ప్లేట్లు సరిగా లేని వారు 16 వాహనాలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను నడుపుతున్న పెద్ద వారు 22 మందిని ట్రాఫిక్ పోలసీలు అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో ఎస్ఐలు షేక్ మౌలానా షరీఫ్, ఎం.జోజి పాల్గొన్నారు.

ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షునిగా విశ్వనాథ్ నియామకంపై హర్షం

ప్రజాశక్తి -ప్రత్తిపాడు : వర్గీకరణ లక్ష్య సాధనలో భాగంగా జాతీయ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి వ్యవస్థాపక అధినేత మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సామాన్య కార్యకర్త స్థాయి నుండి అంకిత భావంతో పనిచేస్తున్న విశ్వనాద్ మాదిగను ఎంఎస్‌ఎపి రాష్ట్ర అధ్యక్షునిగా నియామకం హర్షనీయమని ప్రతిపాడు నియోజకవర్గ ఎంఎస్‌పి నాయకులు దున్న సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రెండున్నర దశాబ్దాల క్రితమే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నిర్వహించిన మాదిగల మహా పాదయాత్రకు యువ సైనికుడిగా పాదయాత్ర మొత్తానికి ఇంఛార్జిగా సమర్ధవంతమైన బాధ్యతను నెరవేర్చడమే కాకుండా ఎన్నో మహెూత్తర ఉద్యమాల్లో విశ్వనాద్ పాత్ర అతికీలకం అని తెలిపారు. మాదిగ లాయర్ ఫెడరేషన్ (ఎంఎల్‌ఫ) జాతీయ అధ్యక్షుడిగా సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. రె యువసేన కార్యకర్తగా ఉద్యమ ప్రస్థానం మొదలుపెట్టిన రోజునుండి ఎంఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎమ్ఎల్ఎఫ్ జాతీయ అధ్యక్షునిగా కొనసాగడం అభినందనీయమన్నారు. జనవరి 1 వ తేదీనుండి 26వ తేదీ వరకు అభినందన సభల కార్యక్రమంలో భాగంగా 2వ తేదీన గుంటూరులో జరుగు అభినందన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పండగ పూట విషాదం



ఫిరంగిపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం, పిడుగురాళ్ల

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందిన ఘటన ఃలు సోమవారం చోటు చేసుకున్నాయి. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన గ్రంధి సుబ్రహ్మణ్యం (38) స్థానికంగా హోటల్‌ను నిర్వహిస్తుంటాడు. సుబ్రహ్మణ్యంకు గుంటూరుకు చెందిన సాయితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. సంక్రాంతి నేపథ్యంలో సాయి ఇటీవలే పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వేళ హోటల్ నిర్వహణను పూర్తి చేసుకున్న సుబ్రహ్మణ్యం గుంటూరులోని అత్తగారి ఇంటికి మధ్యాహ్నం నుండి బయలుదేరాడు. రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలేనికి చెందిన మాచర్ల కోటేశ్వరరావు (27) గుంటూరులోని ఓ ప్రైవేటు బీమా సంస్థలో పని చేస్తున్నాడు. కోటేశ్వరావుకు ఒక అక్క ఉండగా ఆమెకు వివాహమైంది. ఒక్కగానొక్క కొడుకైన కోటేశ్వరరావు సొంతూరుకు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలంలోని వేములూరుపాడు పరిధి ఎన్ఎస్‌పి కాల్వ సమీపానికి రాగానే సుబ్రహ్మణ్యం వాహనాన్ని కోటేశ్వరరావు వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ వాహనాలపై నుండి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. మాచర్ల కోటేశ్వరావు అక్కడికక్కడే మృతి చెందగా సుబ్రహ్మణ్యంను 108లో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. అయితే అప్పటికే ఆయనా చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సుబ్రహ్మణ్యం తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు.

లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని లక్ష్మీ బార్ సమీపంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ అమీర్ వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ నౌషిద్(17) అతని స్నేహితులు తేజ, నాగుల్ సైదులు కలిసి ద్విచక్ర వాహనంపై పట్టణం నుంచి కొండమోడు వైపు వెళ్తుండగా కొండమోడు వైపు నుంచి పిడుగురాళ్ల వైపు వస్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో నౌషిద్ అక్కడిక్కడే మృతి చెందగా తేజ, నాగుల్ సైదులు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలిని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈతకెళ్లిన యువకుడు మృతి

ప్రజాశక్తి - దుగ్గిరాల

చేతికంది వచ్చిన కుమారుని మరణం ఆ కుటుంబంలో తీవ్ర విషాధం నింపింది. మంగళగిరి మండలం నూతక్కికి చెందిన శ్యామల హర్షవర్ధన్‌రెడ్డి (25) ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి దుగ్గిరాల మండలం వీర్లపాలెం వద్ద కృష్ణానదిలో ఈతకు వచ్చాడు. నది పాయలో దిగి మునిగిపోయాడు. ఇది గమనించిన స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి మృతదేహాన్ని వెలుపలికి తీయించారు. మృతదేహానికి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుఆర్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. మృతుని తండ్రి శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ షేక్ సత్తార్ తెలిపారు.

ఈతకు వెళ్లి మృతిచెందిన హర్షవర్ధన్ రెడ్డి

ఈసురోమంటున్న ఇళ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

వాసులకు ఇళ్లు కేటాయించిన పేరేచర్ల జగనన్న కాలనీలో 18 వేల ఇళ్లు మంజూరు చేయగా 10 వేల ఇళు కాంట్రాక్టరు ద్వారానే నిర్మించాలని తలపెట్టారు. కానీ ఇంత వరకు పట్టుమని 10 ఇళ్లుకూడా పూర్తి చేసి గృహ ప్రవేశం చేయించలేకపోయారు. మెప్మా, డిఆర్‌డిఎ ద్వారా జిల్లా మొత్తం మీద 25 వేల మందికి రూ.35 చొప్పున రుణాలు ఇప్పించినట్టు అధికారులు చెబుతున్నారు. అయినా ఇళ్లు పూర్తి అయ్యే పరిస్థితి లేదు.

ఒక్కొ ఇంటి నిర్మాణానికి రూ.లక్షా 80 వేలు కేటాయించి ఇసుక ఉచితంగా, సిమెంటు, ఇనుము ఇతర మెటీరియల్ తక్కువ ధరకు సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ 48 నుంచి 72 అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్న పక్కా ఇళ్లకు కనీసం నాలుగు నుంచి ఐదు లక్షలు ఉంటేనే పూర్తవుతాయని లబ్ధిదారులు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం ఇచ్చే సొమ్ముతో నిర్మాణం కష్టమని తెలిసినా అధికారులు లబ్ధిదారులపై వివిధ రూపాల్లో వత్తిడి తెస్తున్నారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించిన, రహదారికి దగ్గరగా ఉన్న కాలనీల్లోనే ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. కాలనీలు జనావాసాలకు దూరంగా ఉండి, మౌలిక సదుపాయాలు ఏమాత్రం పూర్తి కాని ప్రాంతాల్లో మాత్రం నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని నిర్మించిన చోట ఇళ్ల నిర్మాణం కొంత పురోగతిలో ఉన్నాయి. ప్రధానంగా పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో దాదాపు 5 వేల ఇళ్ల పూర్తి కావచ్చాయి.

మరోవైపు పెరిగిన మెటీరియల్ ధరలు, కూలి ఖర్చుతో నిర్మాణ వ్యయం గణనీయంగా పెరుగుతోంది. పిల్లర్లతో నిర్మాణం చేపట్టాలంటే కనీసం రూ.5 లక్షలు వ్యయం అవుతుందని అధికారులు అంగీకరిస్తున్నారు. అయితే పిల్లర్లు లేకుండా రూ.3 లక్షలతో పూర్తి చేసుకోవచ్చునని చెబుతున్నారు. పేరేచర్లలో పిల్లర్లు లేకుండా కేవలం ఒంటి ఇటుక గోడలపై శ్లాబు వేయడానికి కాంట్రాక్టర్లు ప్రయత్నిస్తున్నారు. పేరేచర్లలో ఇళ్లనిర్మాణంలో నాణ్యత లోపం స్పష్టంగా కన్పిస్తుంది. పేరేచర్ల,కొర్నెపాడు, లాం, ఏటుకూరు తదితర ప్రాంతాల్లో స్థలాలు పొందిన ఎక్కువ మంది లబ్ధిదారుల్లో ఆశించిన కదలిక లేదు. లబ్ధిదారుల్లో 70 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో స్థిరపడిన వారు. అద్దె ఇళ్లల్లో, ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉంటూ పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి ఉన్నారు. వీరంతా పట్టణాలకు 10 కిలో మీటర్ల దూరంలో నిర్మించే కాలనీలకు వెళ్లడానికి ఆసక్తి కనబర్చడం లేదు. కాలనీల్లో మౌలిక సదుపాయాలు ఎప్పటికీ పూర్తవుతాయో.. ఎంత మంది ఇళ్లు కడతారో.. ఎంత మంది కట్టరో ముందు మనం కడితే తమకు కేటాయించిన బ్లాక్‌ల్లో మిగతా వారు కట్టకపోతే తమ పరిస్థితి ఏమిటన్నదీ లబ్ధిదారులకు అంతుబట్టడం లేదు. దీంతో మొత్తం నిర్మాణాలు మందగమనంగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో ఉగాది నాటికి రాష్ట్రం మొత్తం 2 లక్షల ఇళ్లను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. ఇందులో భాగంగా జిల్లాలో 8,705 ఇళ్లు శ్లాబ్ దశకు చేరుకోవడంతో వీటిని పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలని జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ముచ్చటగొల్పిన బొమ్మల కొలువు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

చూడముచ్చటగా సింగారించుకున్న అలంకారం. బాపట్లలో కనువిందు చేస్తున్న బొమ్మల సింగారం. రమణీయత ఉట్టిపడే అద్భుత సంబరం.

మూడున్నర దశాబ్దాలుగా వేలాది బొమ్మలను సేకరించి ఆ ఇంట ప్రదర్శించటం ఒక ఆనవాయితీగా వస్తోంది. సంక్రాంతి పర్వదినాలలో ప్రత్యేక ఆకర్షణీయమైన బొమ్మల కొలువు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతిలో కనిపించే ఈ సంస్కృతికి శ్రీకారం చుట్టారు బాపట్లకు చెందిన పాపినేని ధనలక్ష్మి కుటుంబం.

1984 నుంచి వివిధ రకాల బొమ్మలను సేకరించడం మొదలు పెట్టారు. విహార యాత్రకు వెళ్లిన ప్రతిసారి కొన్ని బొమ్మలు తీసుకురావటం ఇంట్లో ప్రదర్శనగా ఉంచడం చేస్తున్నారు. ఒకప్పుడు కేవలం 10 బొమ్మలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు కొన్ని వేల రకాల బొమ్మలు దర్శనమిస్తున్నాయి. ప్రకృతి రమణీయత ఉట్టిపడే అందాలు, ఆరుగాలం శ్రమించే అన్నదాతలు, అందంగా కనిపించే రమణీయ దృశ్యాలు, దేవాలయాలు,

బొమ్మలను తిలకిస్తున్న మహిళలు

దేవుళ్ల బొమ్మలు, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న సుప్రసిద్ధ పర్యాటక కేంద్రాలు, పల్లె వాతావరణం ప్రతిబింబించేలా దృశ్యాలు, ముఖ్యంగా మతసామరస్యాన్ని చాటిచెప్పే అందమైన బొమ్మలు ఇక్కడకు తిలకించటానికి విచ్చేసిన చూపరులకు కనువిందు చేస్తుంటాయి. ప్రతి ఏటా కొన్ని బొమ్మలను పెంచుకుంటూ వెళ్లి తాజాగా ఇప్పటివరకు వేల రకాల బొమ్మలను సేకరించగలిగారు. బొమ్మలు కొనటం ముఖ్యం కాదు. వాటిని భద్రపరచటంలోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని గురు ధనలక్ష్మి తెలిపారు. ప్రతి బొమ్మను జాగ్రత్తగా అమర్చి ప్రతి ఏడాది వాటిని సంక్రాంతి, కనుమ పర్వదినాల్లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వినూత్నంగా భూకైలాస్ ఏర్పాటు చేశామని తెలిపారు. కుటుంబ సభ్యులందరూ కలసి ఇది ఒక వేడుకగా జరుపు కుంటారన్నారు. ఈ బొమ్మల కొలువును తిలకించేందుకు చుట్టుపక్కల అనేకమంది ఇంటికి విచ్చే స్తుంటారు. ఇది ఒక అందమైన అనుభూతిగా, సంక్రాంతి శోభ ఉట్టిపడేలా ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తోంది. ఈ కార్యక్రమాన్ని మూడున్నర దశాబ్దాలుగా చేపడుతున్నామని ధనలక్ష్మి చెబుతున్నారు. బొమ్మలు తిలకించడానికి వచ్చిన అతిథులకు చక్కటి గౌరవాన్ని అందించి వారు తనివితీరా బొమ్మలను తిలకించేలా పాపినేని కుటుంబ సభ్యులు ఎంతో ఆసక్తి కనబరుస్తుంటారు. సంక్రాంతి సంబరాలను చక్కటి వేడుకగా జరుపుకుంటారు. మన సంస్కతి, సాంప్రదాయాలను ప్రతి ఒక్కరికీ తెలియజేసేందుకు మూడు రోజులపాటు ఈ బొమ్మల కొలువును అందుబాటులో ఉంచుతారు. పాపినేని కుటుంబం చేస్తున్న కృషి ప్రశంసనీయం హర్షణీయం. ఈనెల 15న ప్రారం భించిన ఈ బొమ్మల కొలువు 17వ తేదీ రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుందని ధనలక్ష్మి తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్తను హత్య

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరిలో దారుణం జరిగింది. కట్టుకున్న భార్యే ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. భార్యకు ప్రియుడికి మధ్య పెళ్లికి ముందున్న సన్నిహిత సంబంధం.. పెళ్లైనా తర్వాత కూడా కొనసాగటం హత్యకు దారి తీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరికి చెందిన వింజమూరు క్రాంతి కుమార్ అనే యువకుడికి ఏలూరుకి చెందిన గంగా లక్ష్మితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. వివాహం కాకముందే గంగా లక్ష్మికి మరిడయ్య అనే వ్యక్తితో సంబంధం ఉందని స్థానికులు అంటున్నారు. వివాహం అనంతరం ఇది కొనసాగటంతో భార్యాభర్తల మధ్య ఘర్షణలు చెలరేగాయి. శనివారం అర్ధరాత్రి గంగా లక్ష్మి ప్రియుడితో సన్నిహితంగా ఉండటం భర్త క్రాంతికుమార్? గమనించాడు. దీంతో భార్యతో గొడవకు దిగాడు. దీంతో భార్య గంగా లక్ష్మి ప్రియుడు మరిడయ్యతో కలిసి భర్త క్రాంతికుమార్?ను హత్య చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. భార్య గంగా లక్ష్మి, ప్రియుడు మరిడయ్యతో పాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి నివాసంలో చోరీ

ప్రజాశక్తి- మంగళగిరి రూరల్

బిఎస్ఎన్ఎల్ విశ్రాంత జేఈ నివాసం గహంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యర్రబాలెం అంబటినగర్ కు చెందిన బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి తాడేపల్లి సత్యసాయి, లలిత దంపతులు సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 13వ తేదీ శుక్రవారం హైద్రాబాద్ లోని కుమార్తె ఇంటికి వెళ్లారు. ఊరు వెళ్లే ముందు విలువైన కొన్ని వెండి వస్తువులను పక్కింటి వారికి అప్పగించి తాము వచ్చే వరకూ తమ నివాస గహాన్ని చూస్తుండమని జాగ్రత్తలు చెప్పి మరీ వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు తలుపు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువా, అల్మరాల్లోని బట్టలన్నీ చిందరవందరగా పడవేసి ఇంట్లో దాచుకున్న సుమారు రూ.30వేల నగదును దోచుకెళ్లారు. సోమవారం ఉదయాన్నే హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన సత్యసాయి, లలిత దంపతులు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం చూసి లోపలికి వెళ్లగా చూడగా బట్టలన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో హుటాహుటీన మంగళగిరి రూరల్ పోలీసులు చోరీ జరిగిన నివాసానికి చేరుకుని బాధితుడిని వివరాలు అడిగి తెలుసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా గుంటూరు నుంచి క్లూస్ టీమ్ ను రప్పించి పూర్తి ఆధారాలు సేకరించి నిందితులను గుర్తించే పనిలో రూరల్ పోలీసులు నిమగ్నమయ్యారు.

ఒకే రోజు రెండు దేవాలయాల్లో చోరీ

ప్రజాశక్తి- తాడేపల్లి

రాజధానిలో భాగమైన పెనుమాకలోని రెండు దేవాలయాల్లో ఒకేరోజు దొంగలు పడ్డారు. బ్రహ్మం గారి గుడి, రాముల వారి గుడిలో ఈ దొంగతనాలు జరిగాయి. హుండీలు పగులగొట్టి దొంగలు నగదు దోచుకెళ్లారు. సిసి కెమెరాల ఫుటేజ్ ద్వారా దొంగను గుర్తించినట్లు సమాచారం. గతంలో మందడంలోని సాయిబాబు ఆలయంలో దొంగతనం చేసిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిసింది.రాములవారి దేవాలయం చైర్మన్ మన్నం అప్పాజీ, తాడేపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు మృతి

శ్యామ్ సుందర్ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-తెనాలి

వ్యక్తిగతంగా దూషించి, తనపై భౌతిక దాడికి పాల్పడ్డారన్న కారణంగా ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మతి చెందాడు. కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం కొలకలూరు గ్రామానికి చెందిన పొన్నెకంటి శ్యాంసుందర్ (22)పై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తిగతంగా దూషించి, దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో మనస్థాపానికి గురైన శ్యామ్ సుందర్ ఈనెల 14న మధ్యాహ్నం పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. విజయవాడలోని ఓ ప్రైవేటు వైద్య శాలలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే శ్యామ్ సుందర్ కు స్థానికంగా ఉన్న ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఉందని, దానిని ఆసరాగా చేసుకొని, దీనికితోడు గతంలో ఉన్న విభేదాలను దష్టిలో ఉంచుకొని శ్యామ్ సుందర్ పై దాడికి పాల్పడినట్లు సమాచారం.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగడిగుంట వడ్డెర బజార్ చెందిన యువకుడు ఇటీవల గాయపడి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు లాలాపేట పోలీసులు తెలిపారు. వడ్డెరబజార్‌కు మూడో లైన్ కి చెందిన బత్తుల అచ్చయ్య (36) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడని ఈనెల 10వ తేదీన తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి పిట్టగోడ పైన కూర్చుని మాట్లాడు తుండగా, ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడడం వల్ల తలకు బలమైన గాయం అయినదని, చికిత్స పొందుతూ మృతి చెందినట్టు తెలిపారు. మతుడు భార్య అయిన బత్తుల మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యనారాయణపురం వద్ద దారిదోపిడి

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని సత్యనారాయణపురం వద్ద దారి దోపిడీ జరిగిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం రమణా రెడ్డి పాలెం గ్రామానికి చెందిన దార్ల రాముడు దంపతులు బేల్దారు పనుల కోసం హైదరాబాదు వలస వెళ్లారు.సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కొండ్రముట్ల గ్రామపంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆపి దార్ల రాముడు బహిర్భూమికి వెళ్ళగా భార్య రమణమ్మ ద్విచక్ర వాహనం వద్ద నిలబడి ఉండగా వినుకొండ వైపు నుండి ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి రమణమ్మ వద్ద ఉన్న బ్యాగును బలవంతంగా లాక్కొని పారిపోయారు. బ్యాగులో రూ.1.60 లక్షలు నగదు,చెవి కమ్మలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. జరిగిన ఘటనపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై విప్పర్ల వెంకటరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మంది జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి

పాత మంగళగిరి దింపుడు కళ్ళం వద్ద పేకాట స్థావరంపై మంగళగిరి పట్టణ సీఐ అంకమ్మరావు సూచనల మేరకు ఎస్సై నారాయణ మహేంద్ర ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం దాడి నిర్వహించారు.

ఈ దాడిలో ఎనిమిది మంది పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసి రూ. 32,540 నగదు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

'వివాహం చేయకపోతే చంపేస్తా'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి: తాను ప్రేమించిన యువతితో వివాహం జరిపించాలని లేదంటే చంపేస్తానని బెదిరిస్తున్నారని గుంటూరు నేతాజీ నగర్ కు చెందిన పూసపాటి రవికుమార్‌పై రాజేంద్రనగర్‌కు చెందిన యువతి తల్లిదండ్రులు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజేంద్రనగర్ రెండో లైన్లో నివసించే వారి బం ధువుల ఇంటిలోనికి అక్రమంగా ప్రవేశించి వారి అమ్మాయితో తనకు పెళ్లి చేయాలని అలా చేయకపోతే చంపేస్తానని కత్తితో బెదిరించినట్లు అసభ్య కరంగా తిట్టినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాల్వలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని 7వ వార్డుకు చెందిన మతిస్థిమితం సరిగ్గా లేని ఖగ్గా దుర్గారావు(38) మృతదేహం తుంగభద్ర కాలువలో లభ్యం సుమారు ఐదు రోజుల క్రితం స్నానం చేయడానికి వెళ్లి ఫిట్స్ రావడంతో నీళ్లలో పడి మతి చెందినట్లు భావిస్తున్న స్థానికులుకుళ్ళిన మతదేహాన్ని కాలువలో నుంచి వెలికి తీసిన పోలీసులు అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన్య ప్రాణుల వేటగాడు అరెస్ట్

ప్రజాశక్తి - వినుకొండ

అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఫారెస్ట్ రేంజర్ సయ్యద్ హుస్సేన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు రాబడిన సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున బొల్లాపల్లి మండలం, కనుమల చెరువు బీట్ లో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తిని గమనించి సోదా చేయగా, అతని వద్ద చనిపోయిన అరుదైన పునుగుపిల్లి, అడవి కుందేలు తోపాటు నాలుగు జీవించి ఉన్న కుందేళ్లను గుర్తించడంతో, సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. విచారణలో అనుమానితుడు ముట్టుకుల గ్రామానికి చెందిన గుడిపే చిన్న శీను, వెంకట్రావుగా నిర్ధారించడం జరిగిందన్నారు. నిందితునిపై వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం సెక్షన్ 51 క్రింద కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ముందు హాజరు పరిచామన్నారు. ఈ తనిఖీలలో ఎస్ డిఎఓ ధర్నాటి రాజు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు..

IN THE COURT OF THE MACT CUM
X ADDL. CHIEF JUDGE
CITY CIVIL COURT
AT: HYDERABAD,
O.P.No. 1805 OF 2021

Between:
Allaka J V S B L. SRINIVAS ....Petitioner
AND
I Surendra Babu & Others ....Respondents

To,
R-2: Dhulipalli Kalyan S/o: Seshadri, age: Major, Occ: Car Owner, R/o: 5-314, Main Road, Narasaraopet, Guntur, A.P.

Whereas the above named Petitioners have filed the above O.P. against you and another for grant of compensation under the M. V Act. Please take notice that the above O.P. stands posted to **14-02-2023** for your appearance, you are required to appear before Hon'ble Court at **10: 30** am on the above date either in person or through and advocate, failing which the matter will be decided exparte

// BY ORDER OF THE COURT//

C. SATHISH KUMAR REDDY
ADVOCATE,
Plot No : 36/1 #3-125/36
Shanthinagar Colony, Uppal,
Hyderabad-39

గురువే ప్రత్యక్ష దైవం

ప్రజాశక్తి - వినుకొండ

గురువే ప్రత్యక్ష దైవమని అభిల్, కలాం,థెరిస్సా సేవా సొసైటీ, ఆశిష్ హెల్త్ ఆర్గనైజషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చందోలు నాగేంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని గుఱ్ఱం జాషువా కళా ప్రాంగణంలో ఆదివారం అభిల్, కలామ్, థెరిస్సా సేవా సొసైటీ ఫౌండర్ చందోలు నాగవాణి , కన్వీనర్ డాక్టర్ మన్నవ రవి అధ్యక్షతన, రెండవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎన్ఆర్ఐ డాక్టర్ నాగేంద్రబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గురువును దైవంగా భావిస్తే భవిష్యత్ బంగారు మయమవుతుందన్నారు. ఉన్నత స్థానానికి వెళ్లిన తర్వాత సమాజానికి,దేశానికి మనం ఏమి చేశామని ప్రశ్నించుకోవలన్నారు. సమాజానికి ,దేశానికి తమ కుటుంబ సభ్యులందరు సేవ చేస్తున్నారని అన్నారు. వినుకొండ, విజయవాడ, రేపల్లె ప్రాంతంలో 15 ప్రాంతాల్లో ఉచిత ట్యూషన్ సెంటర్ లు,వైద్య సేవలు, పేదలకు అందిస్తున్నామని, భవిష్యత్ లో తమ సేవలు విస్తృత పరుస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు రవి, పి.సుబ్బారావు, రామారావు, జి.హిట్లర్,వి.అశోక్ కుమార్ పదవ తరగతి విద్యార్థులకు, ఎస్ఎస్సి మోడల్ పేపర్ బుక్స్, ప్యాడ్, పెన్నులు అందజేశారు. విద్యార్థులు ఏకపాత్రాభినయం, వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షకీలా, అభిల్ కలాం తెరిసా సేవా సొసైటీ ప్రెసిడెంట్ పి.రజినిష్, ఎంఈఓ జప్రుల్ల, కవి, కేజే రమేష్, మానవతా సేవా సొసైటీ ఫౌండేషన్ జ్యోతి బాబు, హైకోర్టు అడ్వకేట్ అనురాధ, కౌన్సిలర్లు, నరసింహారావు, బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక నల్లపాడు రోడ్డు లోగల అమ్మ ట్రస్ట్ నిర్వాహకులకు సోమవారం సాయంత్రం నాలుగు ఏళ్ల బాలుడు లభ్యం అయ్యాడు. వారు వెంటనే నగరం పాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. నగరంపాలెం సిఐ హైమారావు బాలుడి వివరాలు తెలుసుకుని వారి తల్లిదండ్రులను గుర్తించేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. గంట వ్యవధిలోనే రామిరెడ్డినగర్ నాల్గో లైనుకు చెందిన బాలుడి తండ్రి, బీహార్ కు చెందిన రిజ్వాస్ అంశారిగా గుర్తించారు. సకాలంలో స్పందించి బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగించినందుకు సిఐ హైమారావు, అమ్మ చారిటబుల్ నిర్వాహకులను అధికారులు అభినందించారు.

అమరవీరుల స్థూపాన్ని సందర్శించిన గడ్డం సాహెబ్

ప్రజాశక్తి - దాచేపల్లి

నారాయణపురంలోని తెలంగాణా సాయుధ పోరాట అమరవీరుల స్థూపాన్ని 95 ఏళ్ల తెలంగాణా సాయుధ పోరాట యోధుడు గడ్డం సాహెబ్ సందర్శించారు. అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. దేశంలో పెరుగుతున్న ఫాసిజానికి విరుగుడు ప్రజా పోరాటం మాత్రమేనని, దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత అభ్యుదయవాదులపై ఉందని అన్నారు. ఆయనవెంటన వివిధ సంఘాల నాయకులు కె.నవజ్యోతి, బి.కృష్ణారెడ్డి, టి.సత్యనారాయణ, వెంకటరెడ్డి, ఆంజనేయ రాజు, కోట సాయి కుమార్ పాల్గొన్నారు.

వేడుకల్లో ఎమ్మెల్యే, కలెక్టర్ స్టెప్పులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో సంక్రాంతి సంబ రాలు ఉత్సాహంగా జరిగాయి. నరసరావుపేటలో డిఎస్ఎ స్టేడియంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు మహిళలకు ఆటలు, పాటలు పోటీలను నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి ఫ్యాషన్ షో (సంప్రదాయ దుస్తుల పోటీలను కుటుంబ సభ్యులతో) నిర్వహించారు. పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నాట్యం ఆకట్టుకుంది. యాంకర్ శాంతి తన ప్రసంగాలతో యువతలో యువత లో సంతోషం పంచారు. వినుకొండకు చెందిన ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు శంకర్ ప్రదర్శనలకు ప్రేక్షకులు మంత్ర ముగ్ధ లయ్యారు. శంకర్‌ను సత్కరించారు. సరికొండ రమాదేవి కవితా సమ్మేళనం ఆకట్టుకుంది. లెజెండరీ సింగర్ మాల్గాడి శుభ పాడిన పాటలు అంద రిలో ఉత్సహం నింపాయి. కలెక్టర్ శివ శంకర్ కుటుంబ సభ్యులు, నరసరావు పేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి హాజ రయ్యారు. ఒడిశా బృందం పైకా యాక్ట్ - ఈజిప్టు తులురా యాక్ట్, సోలో కార్యక్రమాలతో సందడి చేసింది. జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, జిల్లా డిఆర్‌డిఎ పిడి బాలు నాయక్ పర్యవేక్షణలో జరిగాయి.

ఉత్సాహంగా.. కోలాహలంగా..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

బంధాలు బలపడేందుకే పండుగలు, మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు ప్రజల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య అన్నారు. ఆదివారం స్థానిక శాలివాహన నగర్ లో పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె), ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజానాట్యమండలి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సంక్రాంతి ఆటల పోటీల ఆయన ప్రారంభించారు. ఈ సం దర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు డివైఎఫ్ఐ మాజీ నాయకులు ఎం.హరిపోతరాజు అధ్యక్షత వహించారు. పాములయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ నేడు గ్రామీణ సంస్కృతికి తూట్లు పొడిచే సంస్కృతిని ముందుకు తీసుకొస్తున్నారని, అధికార పార్టీకి చెందిన వారు సైతం పండుగలను అడ్డుపెట్టుకొని గ్రామీణ సంస్కృతిని విచ్చిన్నం చేసేందుకు కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో గ్రామీణ సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు.అందుకే ప్రజా తంత్ర సంఘాల ఆధ్వర్యంలో ప్రజల్లో ఐక్యతను పెంపొందించేందుకు ఈ ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా పట్టణ ఉపాధ్యక్షులు ధరణికోట విమల, పిఎస్‌వికె కన్వీనర్ పొట్టి సూర్యప్రకాశరావులు మాట్లాడుతూ ప్రజలలో ఐక్యతను విచ్చినం చేసేందుకు పండుగల సందర్భంగ యువతను పెడదో పట్టించేందుకు రకరకాలైన జూదాలు నిర్వహిస్తున్నారని, వీటి భారీ నుండి ప్రజలను ,యువతను ఐక్యం చేసే అభ్యుదయకర కార్యక్రమాలను ఈ ఆటల పోటీలను నిర్వహిస్తున్నా మన్నారు. ఇటువంటి ఆటలను పట్టణ, గ్రామీణ ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఆటలలో 100 మంది మహిళలు, యువతీ యువకులు పాల్గొన్నారు. ముగ్గుల పోటీలలో ఆరేపల్లి జయలక్ష్మి, పెద్దల మ్యూజికల్ చైర్ లో సెగ్గం భార్గవి, పిల్లల మ్యూజికల్ చైర్‌లోఎ. రాహిణి, పిల్లల రన్నింగ్ లో ఎం.అంకమ్మరావు, పెద్దల రన్నింగ్ లో ఎన్.సందీప్, కుండకొట్టుడులో గొట్టం అభి, లెమన్ స్పూన్ లో కె. గాయత్రిలు ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులను పొందారు, ముగ్గుల పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరికీ కన్సోలేషన్, మిగతా ఆటల అన్నింటిలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలకు ఇంజం శాంతి, అవ్వారు శిరీషలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. డివైఎఫ్ఐ డివిజన్ నాయకులు జడ రాజ్ కుమార్, ఐద్వా పట్టణ అధ్యక్షులు మునగాజ్యోతి, ఎం. రమా కుమారి, కౌలు రైతు సంఘం నాయకులు పెండ్యాల మహేష్ ,యర్రంశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు. మంద సైదేశ్వర రావు, కంబాల పెద వెంకయ్య, గొట్టం అభి, సిగ్గం నరేష్, సిగ్గం శ్రీనివాసరావు కార్యనిర్వాహకులుగా వ్యవహరించారు.

చిన్నారులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సంక్రాంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సత్తెనపల్లి మం డలం రెంటపాళ్ల, ఫణిదం, గుడిపూడి గ్రామాల్లో చిన్నారులకు ఆటల పోటీలు మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వ హించారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఐద్వా ఆధ్వర్యంలో ఆటలు పోటీలు నిర్వహించారు. ఫణిదం లో జరిగిన ఆటల పోటీల్లో మహిళా సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని, రావూరి పూర్ణచంద్ర రావు, వంగర తులసి, గోపి, రెంటపాళ్ళలో జరిగిన ఆటల పోటీల్లో మహిళా సంఘం సత్తెనపల్లి కార్యదర్శి గద్దె ఉమ శ్రీ, ఇం జనం అరుణ, గ్రామ నాయకులు మక్క పాటి నరసింహారావు బొల్లెపల్లి రామా రావు, అమూల్య పాల్గొన్నారు. అలాగే, గుడి పూడిలో జరిగిన ఆటలు పోటీల్లో ప్రముఖ న్యాయవాది పిన్నమనేని పాములయ్య, సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ పొట్టి సూర్యప్రకాష్ రావు డివైఎఫ్ఐ నాయకులు జడ రాజకుమార్ సిఐటియు నాయకులు ఎం హరిపుతురాజు పాల్గొన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహు మతులు అందజేశారు. మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ పాల్గొన్నారు.

యడ్లపాడులో వాలీబాల్ పోటీలు..

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - యడ్లపాడు

డివైఎఫ్ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) లింగారావుపాలెం శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈనెల 12 నుంచి 15వ వరకు గ్రామస్థాయిలో క్రీడా,సాంస్కృతిక పోటీలు జరిగాయి. క్రికెట్ వాలీబాల్, చెస్, క్యారెమ్స్, క్విజ్, వ్యాసరచన, సైకిల్ స్లో, రన్నింగ్ రేస్, 4కె మారథన్, రంగవల్లులు, కుండకొట్టుట, మ్యూజికల్ చైర్స్, ఫన్నీగేమ్స్, కిడ్స్ నుంచి సీనియర్ వరకు నాలుగు విభాగాల్లో పోటీలు నిర్వ హించారు. బహుమతుల పంపిణీ కార్య క్రమంలో స్థానిక జెడ్పీహైస్కూల్ విద్యా ర్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విజేతలకు డీవైఎఫ్ఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు బహుమతులు అందించారు. ఎన్నారైలు, గ్రామస్తులు, విజన్‌ఫౌండేషన్, గ్రామ అభివృద్ధి కమిటీ, పూర్వవిద్యార్థుల సంఘం సంక్రాంతి వేడుకలు నిర్వహణ కొన సాగింపనుకు రూ.5 లక్షల మూలధనం అందించారు. పోటీలను డివైఎఫ్ఐ ప్రతినిధులు సామినేని శ్రీనివాసరావు, రావూరి సుమన్, కె గోపి, రామోజీ, జి లెనిన్ పర్యవేక్షించారు. ఆయా కార్య క్రమాల్లో సర్పంచ్ షేక్ కరీమున్నిసా, ఎం పీటీసీ సభ్యుడు తోకల వీరరాఘవయ్య, గ్రామపెద్దలు ఆలోకం వెంకటలక్ష్మీనారా యణ, కట్టా శ్రీహరిరావు, నంబూరి కృష్ణారావు, శివరామకష్ణయ్య, గోగడ హరిబాబు, నంబూరి వీరాంజనేయులు, నల్లపనేని భావనారాయణ, పూర్వ విద్యార్థుల సం ఘం నుంచి నంబూరి నరసింహారావు, శొంఠినేని వెంకటనారాయణ, నెల్లూరి వంశీ పాల్గొన్నారు.

సత్తెనపల్లిలోని శాలివాహననగర్‌లో ముగ్గులు వేయడంలో నిమగ్నమైన మహిళలు

వినుకొండలో వీల్‌చైర్స్ ఆడుతున్న మహిళలు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న జీవీ ఆంజనేయులు

మహిళలు ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి - వినుకొండ

ఐద్వా పల్నాడు జిల్లా అధ్యక్షురాలు ఎస్‌కె రంజాన్ బి ఆధ్వర్యంలో మహిళలకు, యువతులకు స్థానిక సీతయ్య, సుందరయ్య, వెన్నెపూసవాగు, మాస్టిన్ కాలనీలలో క్రీడా పోటీలు నిర్వహించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్క రించుకోవాలని సూచించారు. ప్రతి నిత్యం కుటుంబ సమస్యలతో సతమతమౌతున్న మహిళలకు పండుగరోజు ఆనందాన్ని ఇచ్చేందుకు ఈ పోటీలు దోహదపడ తాయన్నారు. అనంతరం విజేతలకు బహు మతులను పంపిణీ చేశారు. ముని వెంకటేశ్వర్లు, బండి కోటయ్య,బీరం కోటేశ్వరరావు, కెఎస్ నాసర్ బి పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు..

వినుకొండలోని విష్ణుకుండి నగర్‌లో 32వ వార్డు టిడిపి కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, తెలుగు యువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఈ పోటీలను ప్రారం భించారు. స్థానిక ఎన్ఎస్పి కాలువ కట్టపై ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు మహి ళలు భారీగా తరలివచ్చారు. ఎ ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులను జీవి ఆంజనేయులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్ర దాయాలు ప్రతిబింబించే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు.

మంగళగిరిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

దుగ్గిరాలలో బహుమతులు అందజేస్తున్న నాయకులు

నిడమర్రులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

అలరించిన సంక్రాంతి ఆటల పోటీలు

విజేతలకు డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని 1,2,3,4 వార్డుల్లో డివైఎఫ్ఐ, మహిళా సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, ఆటలు, పాటలు, పద్యాలు, మ్యూజికల్ చైర్స్ వివిధ రకాల పోటీలు స్థానికులను అలరించాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అలాగే 1వ వార్డులో టిడ్కో గృహ లబ్ధిదారులు మాజీ ఒకటో వార్డు కౌన్సిలర్ వివి జవహర్లాల్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డులో కే నాగేశ్వరరావు, నిర్మల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ వివి ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వి వెంకటేశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కే వెంకటేశ్వర్ రావు, సిహెచ్ వెంకటేశ్వరరావు, మీరాబాయి, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ చైతన్య, ఎస్ గణేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు టీ బ్రాహ్మణి, దుర్గారావు, ఆర్ వేణు, ఈగ సాంబయ్య, ఎస్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో సంక్రాంతి ఆటల పోటీలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉత్సాహంగా జరిగాయి. మండల కేంద్రమైన దుగ్గిరాలలోని రామాలయం సెంటర్‌లో జరిగిన కార్యక్రమాలలో సుమారు వందమందికి పైగా మహిళలు ముగ్గులు వేశారు. వారికి ఆదివారం సాయంత్రం బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు వల్లభనేని సాంబశివరావు మాట్లాడుతూ సంక్రాంతి నేపథ్యంలో మహిళలు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. తాడిబోయిన రామస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజల మధ్య సంబంధాలు తగ్గుతున్న తరుణంలో ప్రజాసంఘాలు నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద ఎత్తున కులమతాలకతీతంగా మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ టి. రామస్వామి మాట్లాడుతూ ప్రజల మధ్య అనుబంధాలను మరింత పెంపొందించాలని ఉద్దేశంతో తాము ఈ పోటీలు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు బ్రహ్మయేశ్వరవు, అమ్మిరెడ్డి పోతురాజు, శ్రీను, వల్లభనేని గీతావాణి, స్వర్ణాల అరుణ ,చింతా లక్ష్మీపార్వతి, ఎం.కోటేశ్వరి, వి. వెంకటేశ్వరరావు, పర్యవేక్షించారు.

మంగళగిరి రూరల్: నిడమర్రు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా సిఐటియు, డివైఎఫ్ఐ, ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, ప్రజాశక్తి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. భాగ్యరాజు మాట్లాడుతూ పండగ సందర్భాల్లో కలిసి ఉండాల్సిన గ్రామాల్లో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మత చిచ్చులు రగిలిస్తుందని, ఆటల్లో చదువుల్లో ముందుండి వారికి ఉద్యోగ అవకాశాలు లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలన్నిటిని కార్పొరేటర్లకు కారు చౌకగా అమ్ముతుందని దీని ద్వారా భవిష్యత్తులో విద్యార్థులు, ఆటల్లో మెరిట్‌గా ఉన్నవారు ఉద్యోగ అవకాశాలను కోల్పోతారని అన్నారు. గ్రామాల్లో పండగ సందర్భాల్లో కలిసి జరుపుకునే పండగలను చేసుకోకుండా మతోన్మాదాన్ని రేపుతుందని దీని ద్వారా ఐక్యతను కోల్పోతారని తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున జరుపుకునే ఈ పండగను నూతన రైతు చట్టాల ద్వారా రైతుల వెన్ను విరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. రైతులు నష్టపోయే విధంగా రాష్ట్ర ప్రభుత్వం మేమే తక్కువ కాదన్నట్టు ఆట స్థలాలను అమ్ముకోవటం కోసం కృషి చేస్తుందని, కావున భవిష్యత్తులో గ్రామాల్లో ఆటల్లో నైపుణ్యం ఉన్నవారికి ప్రభుత్వం శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆట స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కట్టె పోగు ప్రకాష్ రావు, కె. వీరయ్య, ఈ.మర్యాదాసు, కె.వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు జి.నాగేశ్వరరావు, కె. నాగేశ్వరరావు, మంచికలపూడి కోటేశ్వరరావు,కె. బుల్లబ్బాయి పాల్గొన్నారు

దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో

పెదనందిపాడు: దేవాదాయ ధర్మాదాయ శాఖ ఊర చెరువు కొప్పర్రు గ్రామం, కొమ్మరాజు సుబ్బరాజు ధర్మ చెరువు, గోగులమూడి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించినట్లు కార్యనిర్వహణ అధికారి కారుమూరి నర్సిరెడ్డి తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు సోమవారం బహుమతుల అందజేసినట్లు చెప్పారు. గ్రామ పెద్దలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ గొల్లపూడి విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈ ఆటలు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో .. సర్వజనుల సర్వ కళల వ్యవసాయ ఆధారిత పండుగ సంక్రాంతి అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోటా వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెదనందిపాడు పాత బస్టాండ్ వద్ద సంక్రాంతి పండుగ విశిష్టతను, నేటి సమాజంలో వచ్చిన మార్పులను ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్టియు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, కె.రామచంద్రరావు, శ్రీనివాసరావు, జి. కోటేశ్వరరావు, మరియదాసు, మోషే, వెంకటేశ్వరరావు, దాసు పాల్గొన్నారు.

పెదనందిపాడు రూరల్ కర్రసాము చేస్తున్న మహిళలు

గోగులమూడిలో బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పెదనందిపాడులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆకట్టుకున్న మహిళా కర్ర సాము

పెదనందిపాడు రూరల్: స్థానిక కామ్రేడ్ కొల్లా వెంకయ్య గ్రంథాలయం వారు నిర్వహించిన గ్రామీణ క్రీడా పోటీలు స్థానిక ప్రజలను ఆకట్టుకున్నాయి. మహిళా కర్రసాములో గుంటూరుకు చెందిన మహిళలు ఎన్.హేమ మానస ధీర, ఎం రమ్య తేజ, కె సంధ్యలు రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించారు. అలాగే యువకుల కర్ర సాములో కె డమరక నాగ సాయి, జె సాయి ,పి. మహేష్ బాబు, కలాం, వెంకట్ వికాస్ ,రవీంద్ర లు చేజెర్ల రాము ఆధ్వర్యంలో బహుమతులు సాధించారు. ఈ కర్ర స్వాము పోటీల పాల్గొన్న బృందాన్ని నిర్వాహకులు సత్కరించారు. అనంతరం స్లో సైకిల్ , కాలితో కొబ్బరికాయ విసరడం, మహిళల మ్యూజికల్ చైర్ పోటీలలో ప్రతిభ చూపిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను డాక్టర్ అనిత, నల్లమడ రైతు సంఘ కార్యదర్శి వై అంకమ్మ చౌదరి, కె. హరిబాబు ,ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు గేరా మోహన్ రావు, రావి శివరామకృష్ణ, రామన్ వెంకయ్య చౌదరి జగదీష్‌లు అందజేశారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో ఎఎస్ఎన్ విద్యార్థులు ప్రతిభ

ప్రజాశక్తి-తెనాలి

అంతర్ కళాశాలల బాడీ బిల్డింగ్ పోటీల్లో ఏఎస్ఎన్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాల ఆవరణలో సోమవారం క్రీడాకారులను ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. అచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆవరణలోని డాక్టర్ వైఎస్సార్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈనెల 12న నిర్వహించిన అంతర్ కళాశాలల బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రకాశం రోడ్డులోని ఏఎస్ఎన్ డిగ్రీకళాశాల విద్యార్థులు 60 కిలోల విభాగంలో ఆకటి రాజా (రజితం), 70 కేజీల విభాగంలో రాతంశెట్టి గోపికృష్ణ(బంగారు), 75 కేజీల విభాగంలో కోట శంకర్(బంగారం), షేక్ రషీద్(రజితం), 80 కేజీల విభాగంలో షేక్ ఆసిఫ్(రజితం), 85 కేజీల విభాగంలో గండికోట సందీప్‌కుమార్(బంగారం) పతకాలు సాధించారని కళాశాల ఫజికల్ డైరెక్టర్ నల్లక శేషగిరిరావు చెప్పారు. అలాగే మిస్టర్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం టైటిల్ 2022-2023ను రాతంశెట్టి గోపికృష్ణ కైవశం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రాంచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజేతలను అభినందిస్తున్న అన్నాబత్తుని శివకుమార్

18న కానిస్టేబుల్ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహిస్తున్న కానిస్టేబుల్ మోడల్ టెస్ట్‌ను అభ్యర్థులు వినియోగించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యావేత్త, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పర్యవేక్షణలో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుంటూరులోని ఆంధ్రా క్రైస్తవ కళాశాలలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకూ, రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజుతో మోడల్ టెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు. కానిస్టేబుల్ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఇతర సమాచారం కోసం 9490099992, 9100639089 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులతో విజయలక్ష్మి స్మారక సేవా సమితి బృందం

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-తెనాలి

ప్రతిభ కలిగిన గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ళ ఉమామహేశ్వర్ అన్నారు. ఈదర విజయలక్ష్మి స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం ఉమామహేశ్వర్ నివాసంలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రతిభను చాటి, ట్రిపుల్ ఐటీ సీట్లు పొందిన కొల్లా శ్రీనివాసు, సిహెచ్ శివనాగరాజు (కొలకలూరు), యార్లగడ్డ మధులత (సంగంజాగర్లమూడి), రంగం నాగతేజస్వ(ఖాజీపేట), బిట్రా యజ్ఞనాగవరప్రసాద్, ఎస్.మణికంఠ రాఘవేంద్ర, బిట్రా సుశ్రియ(పెదరావూరు)కు సమితి నిర్వాహకులు ఈదర వెంకట్రావ్ రూ.2వేలు చొప్పున అందజేసి విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శోభాదేవి, అనురాధ, శివరామకృష్ణ, మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ, జి. సుబ్బారావు, ఈ. పూర్ణచంద్, ఎ. శైలజ, వాసుదేవనాయుడు, వి. విజయభాస్కర్, ఏ.మల్లేశ్వరరావు, వి. శేషగిరిరావు పాల్గొన్నారు.

ప్రకాష్‌ను సత్కరిస్తున్న కమిటీ బృందం

ముట్టడి ప్రకాష్‌కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

పాలనా పరమైన సంస్కరణల్లో ఎన్‌టిఆర్ ప్రజల మన్ననలను చూరగొన్నారని పలువురు వక్తలు కొనియాడారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక పెన్షనర్స్ హోమ్‌లో పాలనలో ఎన్‌టిఆర్ సంస్కరణలు అన్న అంశంపై మాజీ వైస్ చైర్మన్ మాదల కోటేశ్వరరావు, ఈదర వెంకట పూర్ణచంద్ ప్రసంగించారు. అనంతరం ప్రముఖ నటులు. నాటక రచయిత ముట్టడి ప్రకాష్‌ను ఉత్సవ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో కొర్రపాటి వెంకటరావు, నన్నపనేని లింగారావు, వి.భీమేశ్వరప్రసాద్, డి.భవాని, ఎం.రాఘవరావు, కె. రమేష్, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్ర మైన నాగార్జునకొండను సోమ వారం భారీగా పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండ కు నాగసిరి లాంచీ,శాంతి సిరి లాంచీలలో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలోని బుద్ధుని ప్రతి మలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు,9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహా స్తూపం,అశ్వమేధ శాల, స్నానాల గట్టు, బోధి వృక్షంను సంద ర్శించారు. అనం తరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేథ యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవా లయం, ఎత్తి పోతల జలపాతాన్ని తిలకించారు. శని, ఆది, సోమ వారాల్లో కొండను పర్యాటకులు భారీగా సందర్శించారు. దీనితో మూడు రోజుల్లో లాంచీ స్టేషన్‌కు రూ.2 లక్షల ఆదాయం సమకూరింది.

14వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - నరసరావుపేట

టిడిపి ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నరస రావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం స్థానిక 14వ వార్డు కంభంపాలెంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ రూపొందించిన ప్రశ్నవళి పత్రాలను పార్టీ కార్యాలయంలో కంభంపాలెం మాజీ కౌన్సిలర్ కొట్ట కిరణ్, వార్డు నాయకులతో కలిసి అరవిందబాబుకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, రాష్ట్ర రైతు నాయకులు గొట్టిపాటి జనార్ధన్‌బాబు,కడియం కోటి సుబ్బా రావు,కొల్లి బ్రహ్మయ్య,గొల్లపల్లి సల్మాన్,యార్లగడ్డ లింగయ్య, మాబు,నంబురి వెంకట్ రావు,సయ్యద్ బాషా,కాంద్రతి సాంబయ్య వార్డ్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు..

12న సత్రశాలలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు

ప్రజాశక్తి - రెంటచింతల

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించు కొని రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో వచ్చే నెల 12వ తేదీ నుంచి 17 వరకు సత్రశాలల ఈ పోటీలు నిర్వహిస్తామని రైతు సంఘం అధ్యక్షులు పులి ఓబుల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ వరుసగా నాలుగోసారి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీనియర్స్, జూనియర్స్ 6 ,4 ,2, పలు విభాగాలతో పాటు న్యూ కేటగిరి పోటీలు ఉంటా యన్నారు ఒక్కో విభాగానికి వాటి స్థాయి మేరకు 15 నిమిషాల నుంచి 25 నిమిషాల వరకు సమయం కేటాయిస్తా మన్నారు. సీనియర్స్, జూనియర్స్ న్యూ కేటగిరిలో ఏడు రకాల బహుమతులు, మిగతా విభాగాల్లో ఆరు రకాల బహు మతులు ఉంటా యన్నారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా లక్ష రూపా యలు ఇస్తామన్నారు భక్త మల్లారెడ్డి అన్నదాన సత్రంలో ఈ పోటీలు నిర్వ హించ నున్నట్లు చెప్పారు. సమా వేశంలో నెమలి సీతా రామరెడ్డి, మంద లపు వెంకట్‌రెడ్డి, గోగుల వెంక టేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు

ప్రజలకు మంచి చేసే లక్ష్యంతో కలిసి పనిచేయండి

అమరావతిలో గృహసారథుల నియామకంపై సమావేశంలో ఎమ్మెల్యే శంకరరావు

ప్రజాశక్తి-అమరావతి

ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు కలిసి పని చేయాలని పెదకూర పాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సూచించారు. మండల కేంద్రమైన అమరావతి లోని శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ కళ్యాణ మండపంలో సోమవారం గృహసారథుల నియామకంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకర రావు మాట్లాడుతూ అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాలు అందజేయాలన్న లక్ష్యంతో ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమిస్తున్నారన్నారు. ఇప్ప టికే నియోజకవర్గంలో 72 సచివాలయాలకు కన్వీనర్ల నియామకం పూర్తైందన్నారు. అమ రావతి మండల పరిధిలోని మల్లాది గ్రామానికి చెందిన భవిరిశెట్టి హనుమంతరావును మండల సచివాలయాల కన్వీనర్ గా నియమించడం జరిగిందన్నారు. ప్రతి వాలంటీర్ కు అను సంధానంగా త్వరలోనే గృహసారథుల నియా మకం జరుగుతుందన్నారు. వీరందరూ సమ న్వయం చేసుకొని ప్రజలకు మేలు చేయడంతో పాటు పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు వెంపా జ్వాలయ్య, నిమ్మా విజయ సాగర్ బాబు, కోటా హరిబాబు,షేక్ హష్మి,ఈడుపుగంటి కరుణకుమారి, మంగిశెట్టి శ్రీనివాస రావు, విన్నకోట సాంబశివరావు,నాయుడు రాంబాబు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవి

లంకెలకూరపాడు టిడిపి అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

లంకెల కూరపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజ నేయులు అన్నారు. లంకెల కూర పాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని వైవి ఆంజ నేయులు సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. శ్రీని వాసరెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు, టిడిపి గ్రామ నాయకులు రవీంద్రారెడ్డి,కార్యకర్తలు పాల్గొన్నారు.

మాగులూరి ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి- పెదకూరపాడు

స్థానిక షాదిఖానా ఆవ రణలో షేక్ ఇమ్రాన్‌కు మాగు లూరి ఫౌండేషన్ ద్వారా ఎన్నారై భాను ప్రకాష్ రూ.10,000 ఆర్థిక సహాయం సోమవారం అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అర్తి మళ్ళ రమేష్ , బెల్లంకొండ గోపాల రావు, వడ్లమూడి అప్పారావు, ముంతాజ్ వెలవ చెరువు సురేష్, రఘు, పొట్టి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ సంఘ సభ్యుడి 100వ పుట్టినరోజు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండలం పరిధిలో గల వేలూరు లూథరన్ చర్చిలో సోమవారం100వ పుట్టిన రోజు జరుపుకున్న లూథరన్ సంఘ సభ్యులు గడ్డం దావీదును సంఘ పెద్దలు ఘనంగా సత్కరించారు. గ్రామంలోనే అత్యధిక వయసు గల దావీదు బహుజన సమా జ్ పార్టీ సభ్యులు. వంద వసంతాలు నిండిన దావీదు ఇప్పటికి ఎవరి సాయం లేకుండా స్వయంగా నడువ గలుగుతున్నారు.

ఘనంగా లూథరన్ దేవాలయం వార్షికోత్సవాలు

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలో ఆంధ్ర ఇవాలంజిలికల్ లూథరన్ సంఘం వారి పరిశుద్ధ యోహాను లూథరన్ దేవాలయం మూడో వార్షి కోత్సవ వేడుకలు సోమవారం జరిగాయి. ఈ వేడు కల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు,వట్టికుంట ఫౌండేషన్ ఛైర్మన్ వట్టికుంట శేషగిరిరావు లు పాల్గొన్నారు. ఎంతో కష్టపడి అందమైన చర్చి నిర్మించుకొని మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా అం దరికీ పాస్టర్ పాలు బాబు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నిమ్మా విజయ సాగర్ బాబు, హరిబాబు,గుంటూరు కుమారి,ఈడుపుగంటి కరుణకుమారి,భవిరిశెట్టి హను మంతరావు,గుడిసె నాగేశ్వరరావు, గుడిసె జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీఅమరేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-అమరావతి

మండల కేంద్రమైన అమరావతిలో సంక్రాంతి సందర్భంగా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ బాల చాముండిక అమరేశ్వర స్వామి వారి ఆలయంలో అభిషేకాలు, హారతులు నిర్వహించారు. కార్యక్రమాల ఆలయ కార్యనిర్వహణ అధికారి సునీల్ కుమార్,కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-అమరావతి

సంప్రదాయాలకు నిలయమైనదే సంకురాత్రి పండగని విజయవాడ ఇన్నర్ వీల్ క్లబ్ దివస్ అధ్యక్షురాలు కొడాలి కవిత అన్నారు. సోమవారం అమరావతి మండల పరిధిలోని నరకుళ్ళపాడులో మహిళలకు సంక్రాంతి సందర్భంగా ముగ్గులు, బొంగరాలు, గాలిపటాలు, పాటల పోటీలను నిర్వ హించారు. క్లబ్ కార్యదర్శి డాక్టర్ సత్య బొర్రా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మహిళలకు సంప్రదాయ పోటీలు నిర్వహించడం తమ క్లబ్ లో భాగమని చెప్పారు. కొసరాజు బసవ పూర్ణయ్య ఆవరణలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతైన మహిళలకు, పిల్లలకు, పెద్దలకు ఎత్తున బహు మతులను పంపిణీ చేశారు. పోటీలకు న్యాయమూర్తులుగా డాక్టర్ విశ్వేశ్వరరావు, చిన్నమ్మలు వ్యవహరించారు గ్రామంలో తొలిసారిగా రంగవల్లు పోటీ నిర్వహించిన క్లబ్ వారికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

'సైకో పోవాలి.. సైకిల్ రావాలి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నరసరావుపేట

'సైకో పోవాలి - సైకిల్ రావాలి' వాల్ పోస్టర్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద, సామాన్య ప్రజలను పట్టి పీడి స్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనం పాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అవినీతి, అక్రమాలతో సామాన్య,నిరుపేద ప్రజలును పీడిస్తూ ప్రశ్నించిన వారి పై అక్రమ కేసులు పెడుతూ పాలిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర, యువత భవిష్యత్తు బాగుండాలంటే టిడిపి ద్వారానే సాధ్యమన్నారు.

బంగారుపాలెంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని బంగారుపాలెంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. శ్రీగంగాపార్వతి సమేత రామలింగేశ్వర స్వామి, శ్రీసీతారామ దేవస్థానం ఆలయాలో ప్రత్యేక పుష్పాలంకరణలో ఉత్సవ మూర్తు లకు అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామోత్సవంలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఊరి మధ్యలో ఉన్న చెరువులో తెప్పోత్సవం నిర వ్రహించారు. రెండు ఆలయాలకు సంబంధించిన ధర్మకర్తల ఆధ్వర్యంలో రెండు బల్లకట్టు నిర్మాణం, ప్రత్యేక అలంకరణ చేసి దేవతా మూర్తులతో తెప్పోత్సవం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు పలుచోట్ల ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 34 ఏళ్ల తర్వాత కలిసిన వారంతా ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపి సందడి చేశారు. 1988-89 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 71 మందికి గానూ 40కి పైగా హాజరయ్యారు.

చేబ్రోలులో రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చేబ్రోలులో 35 బస్తాల రేషన్ బియ్యంను సోమవారం విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది, పౌర సరఫరాల శాఖ అధికారుల కలసి ఆదివారం అర్ధరాత్రి చేబ్రోలు చౌక డిపో నంబరు -6 నుంచి అక్రమంగా బియ్యం రవాణా చేస్తుండగా నిఘా వేసి పట్టుకున్నారు.

రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పౌరసరఫరాల శాఖ ముద్రలతో ఉన్న గోతాల్లోనే వీటిని తరలిస్తుండగా అధికారులు దాడి చేశారు. డిపో డీలర్ దేవరకొండ కోటేశ్వరి , భర్త శ్రీనివాసరావుల నుండి డిపో బియ్యం తక్కువ ధరకు కొని, ఎక్కువ ధరకు అమ్ముకొనుటకు లారీలో అక్రమంగా తరలిస్తున్నట్లు కనుగొన్నారు. 35 బస్తాల సబ్సిడి బియ్యం బస్తాలను లారీ తో సహా స్వాధీనం చేసుకుని పచ్చికర్ల సుబ్బారావు, చౌక ధరల దుకాణము డీలర్ దేవరకొండ కోటేశ్వరి, భర్త శ్రీనివాసరావు, లారీ యజమాని, డ్రైవర్ పై నిత్యావసర సరుకుల చట్టం క్రింద క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు విజిలెన్సు అధికారులు తెలిపారు. ఎస్ఐ. ఎం.రామచంద్రయ్య స్థానిక సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దారు, చేబ్రోలు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిండి వంటలు, గాలి పటాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

చినకాకాని షైన్ ఆనంద శరణాలయంలో సంక్రాంతిని పురస్కరించుకొని మంగళగిరి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బాల బాలికలకు సంక్రాంతి పిండి వంటలు, గాలిపటాలు పంపిణీ చేశారు. అనంతరం సంఘం ప్రతినిధులు శరణాలయం వద్ద బాలబాలికలచే గాలిపటాలు ఎగర వేయించారు. దీంతో బాలబాలికలు పిండి వంటలు తింటూ గాలిపటాలు ఎగరవేస్తూ ఆనందోత్సవాలతో కేరింతలకొడుతూ పండుగ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, జిల్లా మహిళా కో-ఆర్డినేటర్ కాగితాల స్వాతి, సంఘం నాయకులు అన్నం నాగబాబు, వుడత శ్రీనివాసరావు, వాకా మాధవరావు, ఆలా శివాజీ, పారేపల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శరణాలయం నిర్వాహకులు బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనాలి

ప్రజాశక్తి-తెనాలి:

ఈనెల 19,20,21 తేదీల్లో చెంచుపేట విద్యుత్ ఈఈ కార్యాలంయలో నిర్వహించే విద్యుత్ వినియోగదారుల ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు పాల్గొనాలని ఈఈ వివి చిరంజీవి సోమవారం కోరారు. ఏపి విద్యుత్ నియంత్రణ మండలి వారు ఏపిసిపిడిసిఎల్ 2023-24 ఆర్థిక సంవత్సరాకిని సంబంధించి వార్షిక ఆదాయ ప్రణాళికలో భాగంగా విశాఖపట్టణం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయ సేకరణ చేస్తారన్నారు. ఉదయం 10.30 - 4.30 గంటల వరకూ మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో వినియోగదారులు పాల్గొనాలన్నారు.

మణికొండ ముత్యాలరావు వర్ధంతి

ప్రజాశక్తి- తాడేపల్లి

సిపిఐ తాడేపల్లి నాయకులు మణికొండ ముత్యాలరావు 42వ వర్ధంతి సభ సోమవారం తాడేపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సభకు తాడేపల్లి ప్రాంత సిపిఐ సహాయకార్య దర్శి టి.వెంకటయ్య అధ్యక్షత వహించారు. ముందుగా ముత్యాలరావు చిత్రపటానికి కర్రి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మంగళగిరి ఏరియా సహాయ కార్యదర్శి కె.కాశయ్య మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముత్యాలరావు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎం.డాంగే, ఎం. భాస్కర్, జి.శివ, వి.సాంబిరెడ్డి, కె.సురేష్, ఎస్కె బాషా, హానక్, సిహెచ్ శ్యామ్, లక్ష్మణ,ఎం.వెంకటేశ్వరరావు, ప్రసాద్, ప్రశాంతరాజ్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

హోమియోపతి వైద్యానికి పావులూరి కృషి

ప్రజాశక్తి-గుంటూరు

హెూమియో వైద్యానికి విస్తృత ప్రాచుర్యం కల్పించి, ఆ వైద్య విధానాన్ని ప్రజలకు చేరువ చేసిన గొప్ప వ్యక్తి పావులూరి కృష్ణ చౌదరి అని అవగాహన కార్యదర్శి కొండా శివరామిడ్డి అన్నారు. ఆయన మృతి తెలుగు వారందరికీ తీరని లోటని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పావులూరి కృష్ణచౌదరి హెూమియోపతి వైద్యాన్ని ప్రకాశింప చేశారని, తక్కువ ఖర్చుతో శాశ్వతంగా రోగం నుండి విముక్తి పొందేలా, తెలుగు వారు హెూమియోపతి వైద్యాన్ని విశ్వసించేలా పావులూరి విశేషంగా కృషి చేశారన్నారు.అయిదు దశాబ్దాల క్రితమే తెలుగునాట ఇంటింటికీ హెూమియో వైద్యాన్ని పావులూరి తీసుకువెళ్లారని, రాష్ట్రంలో చాలా కుటుంబాలతో ఆయనకు అనుబంధం ఉందని లక్షలాది మంది ఆయన వద్ద వైద్యసేవలు పొందారని తెలిపారు. పావులూరిని గుంటూరు వాసులు ఎప్పటికీ మర్చిపోలేరని అన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేదెప్పుడు..?

సిపిఎం సర్వేలో స్థానికుల ఆవేదన

ప్రజాశక్తి - మంగళగిరి

ఇళ్ల స్థలాలు మంజూరు చేసినట్లు కాగితాలు ఇచ్చారు కాని ఇంత వరకు స్థలాలు ఇవ్వలేదని, ఎప్పుడు ఇస్తారో కూడా తెలియదని పట్టణంలోని పాత మంగళగిరిలోని నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని సిపిఎం నాయకులు తెలిపారు. సోమవారం పాత మంగళగిరిలో 23,26 వార్డుల్లో సిపిఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.. సర్వే బృందానికి ఆ ప్రాంత ప్రజలు వివిధ సమస్యలను విన్నవించారు. జగన్ ఫోటోతో స్థలాలు మంజూరు చేసినట్లు కాగితాలు ఇచ్చారు గాని ఇంతవరకు స్థలాలు ఇవ్వలేదని తెలిపారు. టిడ్కో గృహాల్లో పేదవాళ్లకు న్యాయం జరగలేదని , డబ్బులు చెల్లించిన వారికే మంజూరయ్యాయని తెలిపారు. అదేవిధంగా వివిధ రకాల ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వారికి అందడం లేదని విమర్శించారు. కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని రద్దు చేసినట్లుగా తెలిపారు. వుడ్ టర్నింగ్ వర్కర్స్‌కు షెడ్లు ప్రత్యేకంగా కేటాయించాలని బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఇళ్లలోనే చేయడం వలన అనారోగ్యానికి గురవుతున్నట్లు వాపోతున్నారని తెలిపారు. సర్వే ప్రాంతంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఎస్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పాత మంగళగిరిలో సర్వే చేస్తున్న సిపిఎం బృందం

ప్రముఖ పారిశ్రామికవేత్త వాసిరెడ్డి కృష్ణమూర్తి కన్నుమూత

సిపిఎం నాయకుల సంతాపం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విజయవాడకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వాసిరెడ్డి కృష్ణమూర్తి అనారోగ్యంతో కన్నుమూశారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎల్ఇపిఎల్ భవన సముదాయంలో ఆయన పార్థీవ దేహానికి కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఘన నివాళులర్పించారు. ఆయన 1960వ దశకంలో విజయవాడకు చలువ యంత్రాలను తీసుకొచ్చారు. యానాంలో చలువ యంత్రాల తయారీ పరిశ్రమను స్థాపించారని కృష్ణమూర్తి కుమారుడు నాగార్జున చెప్పారు. కమ్యూనిస్టు, అభ్యుదయ భావాలను అందిపుచ్చుకున్న కృష్ణమూర్తి... నాస్తికుడిగానే జీవించారు. సిపిఎం, సిపిఐలతో ఆయనకు ఎంతో అనుబంధం ఉంది. ఆయన చివరి కోరికమేరకు కృష్ణమూర్తి పార్థీవ దేహాన్ని విజయవాడలోని సిద్ధార్థ ఆస్పత్రికి అందజేశారు.



వాసిరెడ్డి కృష్ణమూర్తి (ఫైల్)

సిపిఎం నేత సిహెచ్.బాబూరావు సంతాపం

వాసిరెడ్డి కృష్ణమూర్తి మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కృష్ణమూర్తి కమ్యూనిస్టు ఉద్యమాలకు చోదోడువాదోడుగా ఉండేవారని, అభ్యుదయ భావాలను జీవించారని గుర్తుచేశారు.

కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలి

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

తమ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందించాలని కళాశాల పాలకవర్గ అధ్యక్షులు విశ్రాంత ఏఎస్‌పి కాళహస్తి సత్యనారాయణ కోరారు. సోమవారం పెదనందిపాడు పీఏఎస్ కళాశాలలో జరిగిన ఎంబీఏ 2005-07 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశంలో వారు మాట్లాడారు. పెదనందిపాడు ప్రాంతంలో విద్యావ్యాప్తికి కృషి చేయడమే తమ లక్ష్యం అన్నారు. 54 ఏళ్లకు పైగా పూర్తి గ్రామీణ ప్రాంతంలో నిర్వహిస్తున్న ఈ కళాశాలలో అధిక శాతం పేద విద్యార్థులు చదువుతున్నారని వారికి తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ జి వీర రాఘవయ్యను పాలకవర్గ అధ్యక్షులు సత్యనారాయణను, నర్రా వీరయ్యను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు హర్షవర్ధన్, సుమన్, గురున్నాధబాబు , వెంకట కృష్ణ, రంజిత్ పాల్గొన్నారు

కాళహస్తి సత్యనారాయణను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

19న యోగి వేమన జయంతి సభ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు గుంటూరు లోని రామన్నపేట ఒకటవ లైన్ వేదిక కార్యాలయంలో ప్రజా కవి యోగివేమన 351వ జయంతి సభను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి తెలిపారు. ఈ జయంతి సభలో ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, సాహితీవేత్తలు డాక్టర్ మోదుగుల రవికృష్ణ, ప్రొఫెసర్ గుమ్మ సాంబశివరావు, గోళ్ళ నారాయణరావు,మానవత చైర్మన్ పావులూరి రమేష్, ప్రముఖ విద్యావేత్త కన్నా మాస్టారు ప్రసంగిస్తారని ఆయన తెలిపారు.

రేపు శివాలయం హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ముఖ మండపంపై ఈ నెల 18వ తేదీన ఉదయం 9 గంటలకు స్వామివార్లకు భక్తుల సమర్పించిన హుండీలలోని కానుకులను లెక్కించడం జరుగుతుందని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి అధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి తెలిపారు. ఆసక్తిగల భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చు అని ఆయన అన్నారు.

నేడు కోలనుకొండలో షూటింగ్ బాల్ శాప్ లీగ్ ఎంపికలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ యు -17, యు-21 బాల బాలికల శా ప్ లీగ్ సెలక్షన్లు మంగళవారం ఎంటి ఎంసీ పరిధిలోని కొలనుకొండ బైపాస్‌లోని ఎక్సలెన్స్ వాలీబాల్ అకాడమీలో జరుగుతాయని గుంటూరు జిల్లా డిఎస్‌డిఓ చీఫ్ కోచ్ ఏ.మహేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాల బాలికలను ఈనెల 21, 22, 23 తేదీల వరకు విజయవాడలో యు- 21 రాష్ట్ర శాప్ లీగ్ పోటీలకు అర్హులు అవుతారని ఆయన తెలిపారు. అదేవిధంగా 29, 30, 31 తేదీల వరకు బాపట్లలో జరిగే యు -17 రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ శాప్ లిగ్ పోటీలలో పాల్గొంటారని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్ర, అకాడమీ కోచ్ ఆస్కర్ అలీ పర్యవేక్షణలో టీమ్‌లు ఎంపిక చేయబడతాయని ఆయన తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన వారు ఫోన్ నెంబర్లు 9603253251,9963516776 సంప్రదించాలని ఆయన కోరారు.

కాజాలో పరుగుపందెంలో బాలికలు

తాడేపల్లిలో పోటీల్లో పాల్గొన్న బాలికలు

కాజాలో బహుమతి ప్రదానోత్సవం సభలో పాల్గొన్న గ్రామస్తులు

జూదం ఆడం... పందేలు కాయం..

- దశాబ్దాలుగా కొనసాగుతున్న సత్‌సాంప్రదాయాలు
- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబరాన్ని తాకేలా సంక్రాంతి సంబరాలు
- ఉత్సాహంగా పాల్గొన్న పిల్లలు, పెద్దలు
- విజేతలకు బహుమతుల ప్రదానం

సంబరాలను దశాబ్దాలుగా నిర్వహిస్తున్నా ఏ మాత్రమూ వన్నె తగ్గకపోగా ఏటికేడు అంబరాన్ని అంటుతున్నాయి. ఊరంతా ఎలాంటి విభేదాలకూ తావులేకుండా పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు ఉత్సాహంగా పాల్గొంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామైక్యతకు చిహ్నంగాను, వాటిని నిర్వహిస్తున్న ప్రజా సంఘాల ప్రత్యేకతగానూ నిలుస్తున్నాయి.

కాజాలో ముగ్గుల పోటీల కోలాహలం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం కాజాలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సింహాద్రి బసవన్నయ్య, ఆప్టికట్ల శ్రీనివాసరావు మాస్టర్ స్మారక సంక్రాంతి ఆటల పోటీలు ఆర్థల సూర్యనారాయణ క్రీడా ప్రాంగణంలో మూడ్రోజులపాటు నిర్వహించిన సంబరాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ప్రతి ఏడాది మాదిరే ఈ ఏడాదీ ఈ పోటీల్లో యువకులు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. తమ గ్రామంలో టార్చ్ లైట్ వేసి వెతికినా కోడి పందేలు కనపడవనీ.. సిబిఐతో విచారణ చేయించినా పేకాట, ఇతర జూదాలు ఉండవని పలువరు యువకులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇది తమ గ్రామస్తుల చైతన్యానికి నిదర్శనమని అంటున్నారు.

స్థానికుల సహకారంతో గ్రామంలో 64 ఏళ్లుగా డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి సంబంరాలు నిర్వహిస్తున్నారు. 1959లో అప్పటి పెద్దలు మొదలుపెట్టిన ఈ సంప్రదాయాన్ని ఒక్క ఏడాది కూడా విరామం లేకుండా కొనసాగిస్తున్నారు. ఏటికేడు ఈ పోటీలకు స్పందన పెరుగుతోందని, ఇతర వ్యసనాల జోలికి పోకుండా అందరూ ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొంటున్నారని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ ఏడాది రికార్డు స్థాయిలో వెయ్యి మందికి పైగా వివిధ రకాల పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ఆటల పోటీలకు కులాలతో పని లేదనీ.. మతాల ప్రస్తావన రాదని.. గ్రామ ప్రజలందరూ నిండు మనసుతో ఒకచోట చేరి ఈ సంబరాలను అంబరాన్ని తాకిస్తారని ఇక్కడివారు సంతోషంగా చెబుతున్నారు. నిర్వహణ బాధ్యతలు చూస్తున్న డివైఎఫ్ఐ-ఐద్వా సంఘాలకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

ఆదివారం రాత్రి నిర్వహించిన ముగింపు సభ, బహుమతి ప్రదానోత్సవ సభకు ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ హాజరై బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా సంవత్సరాల తరబడి నిర్వహిస్తున్న ఆటల పోటీలు కొనసాగింపు అభినందనీయమన్నారు. ఎంతో స్ఫూర్తితో ప్రజల్లో ఉత్సాహాన్ని నింపటానికి డివైఎఫ్ఐ, ఐద్వా చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ప్రముఖ ఫోరెన్సిక్ వైద్యులు రామిరెడ్డి నర్సిరెడ్డి మాట్లాడుతూ విప్లవాత్మకమైన భావజాలంతో ప్రజలను యువతను సన్మార్గంలో నడిపించేందుకు వారిలో చైతన్యం కలిగించేందుకు ఇటువంటి ఉత్సవాలు నిర్వహించడం స్ఫూర్తి దాయకమన్నారు. సభలో మాజీ ఎంపిటిసి ఇ.ప్రతాపరెడ్డి, ఎస్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

సంబరాల్లో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు కొందరైతే రంగవల్లులను తిలకించేందుకు ఊరుఊరు తరలివచ్చింది. వీటితోపాటు బహుముఖ పోటీలు నిర్వహించారు. షటిల్, స్లో సైకిల్, చెస్, వాలీబాల్, రన్నింగ్, మ్యూజికల్ చైర్స్, ఇతర సాంస్కృతిక ప్రదర్శనల్లో బాలలు, యువత, పెద్దలు, మహిళలు తమ ప్రతిభను చాటారు. పోటీల్లో పాల్గొనేవారు, వారిని ప్రోత్సహించే వారు, ప్రేక్షకుల కేరింతలతో గ్రామంలో నూతనోత్సాహం కనిపించింది. పోటీలను నిర్వాహక కమిటీ సభ్యులు బి.త్రికేష్‌రెడ్డి, ఎ.సాంబశివ రావు, ఆదిశేఖర్, బి.కోటేశ్వరి, ఎ.ప్రకాశరావు, కె.మాధవరెడ్డి, ఎస్.సుమ, ఎ.శ్యామల జ్యోతి, ఎ.విజయలక్ష్మి పర్యవేక్షించారు.

నైపుణ్యాలు పెంచుకునేందుకు చేయూత

బహుమతి ప్రదానోత్సవ సభలో బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ

ప్రజాశక్తి- తాడేపల్లి

నైపుణ్యాలను పెంచుకునేందుకు యువత ముందుకొస్తే వారికి ఎన్‌బి విజ్ఞాన కేంద్రం సహకరిస్తుందని బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ హామీ ఇచ్చారు. సంక్రాంతి ఆటల పోటీల ముగింపు, బహుమతి ప్రదానోత్సవ సభ పట్టణంలోని లీలా సుందరయ్య కళావేదిక ఆదివారం రాత్రి నిర్వహించారు. సభకు ప్రజా నాట్యమండలి నాయకులు కె.కరుణాకరరావు అధ్యక్షత వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ వారం రోజుల పాటు సుందరయ్య నగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆటల పోటీలు నిర్వహించిన ప్రజా సంఘాల కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. యువతీ యువకులు కంప్యూటర్‌తో పాటు ఇప్పుడొస్తున్న వివిధ ఫ్యాషన్ డిజైన్ కోర్సులకు సహాయ సహకారాలందిస్తామని చెప్పారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ యువత సంక్రాంతి పండగ సందర్భంగా చెడు అలవాట్ల వైపు వెళ్లకుండా ఐద్వా, డివైఎఫ్ఐ, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించి తమ పిల్లలను పెద్ద ఎత్తున ఆటల పోటీలకు పంపించడం అభినందనీ యమన్నారు. సిపిఎం రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సుదీర్ఘంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని పెద్దలను కోరారు. ఇళ్ల స్థలాలకు పట్టాలు, ల్యాండ్ కన్వర్షన్, డ్రైనేజ్ సమస్య తక్షణం ముందుకొచ్చాయని వీటి పరిష్కారానికి ఆందోళనకు సిద్ధం కావాలన్నారు. అనంతరం, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాశక్తి బుక్ హౌస్ ఎడిటర్ ఎస్.వెంకటరావు, సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, స్థానిక నాయకులు ఆర్‌వి రాఘవయ్య, పి.గిరిజ, కె.ఉషారాణి, రామచంద్రరావు, బి.రామారావు, ఎస్‌కె బాషా, కొండబాబు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. నులకపేటలోని ఎమ్మెల రామయ్య కాలనీలో సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి వి.దుర్గారావు మాట్లాడుతూ ప్రజల జీవితంలో ఆటలూ భాగం కావాలని కోరారు. ఆటల ద్వారా శరీర ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. నాయకులు రఫీ, ప్రసాద్, నాగవేణు, చాముండీ, నాగదుర్గ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిలో చిన్నారులకు బహుమతులు అందిస్తున్న పి.మురళీకృష్ణ తదితరులు

తాడేపల్లి ఎమ్మెల రామయ్య కాలనీలో బహుమతుల ప్రదానోత్సవం

కాజాలో మ్యూజికల్ చైర్స్ పోటీ

కాజాలో బాలురకు పరుగు పోటీలు

కాజాలో మాట్లాడుతున్న డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్, రామిరెడ్డి నర్సిరెడ్డి

కాజాలో బహుమతుల ప్రదానోత్సవం

తాడేపల్లిలో మాట్లాడుతున్న శివశంకరరావు